
కొల్లాపూర్‌లోని మామిడి తోట

# యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

- మామిడి తోటల్లో నీటి, ఎరువుల యాజమాన్యం పాటించాలి
- ఆకుగూడు, తేనె మంచు పురుగు నివారణ చర్యలు చేపట్టాలి
- వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

కొల్లాపూర్ రూరల్, డిసెంబరు 17 : పండ్లల్లో రారాజు మామిడి పండు, దాని తియ్యదనం గురించి ప్రత్యేకంగా చెప్పవల్సిన అవసరం ఉండదు. వేసవి వచ్చిందంటే మామిడి పండ్ల సీజన్ వచ్చినట్లే. మామిడి పంట్ల సీజన్ కోసం మామిడి ప్రియులు దేశవిదేశాల్లోనూ ఎదురు చూస్తుంటారు. ఎంతో ప్రాముఖ్యత కల్గిన మామిడికి తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్ అని చెప్పవచ్చు. ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి దేశ విదేశాలకు ఎగుమతి జరిగే వాణిజ్య పంటల్లో మామిడి అగ్రగామిగా ఉంది. నాగర్‌కర్నూల్ జిల్లా ప్రాంతంలోని కొల్లాపూర్ ప్రాంతం మామిడికి పెట్టింది పేరు. 27వేల హెక్టార్లలో కేవలం కొల్లాపూర్ ప్రాంతంలోనే మామిడి సాగు అవుతోంది. మామిడి పండ్ల ప్రియులకు తియ్యదానాన్ని, మామిడి పండ్ల వ్యాపారులకు లాభాలను తీసుకొస్తున్న మామిడి పరిశ్రమ రైతులకు మాత్రం నష్టాలనే కలిస్తున్నది. మామిడి రైతులు సకాలంలో సరియైన సమయంలో సమగ్ర పోషకాల యాజమాన్యం పద్ధతులు పాటించకపోవడంతోనే పూత, పిందె దశల్లో ఫలకతి సరిగా జరగక దిగుబడులు తగ్గి నష్టాలను చూడవల్సివస్తోంది. ప్రస్తుతం మామిడి తోటలు నిండుగా పూతతో పాటు, పిందెలను కల్గి ఉన్నాయి. మామిడి దిగుబడికి ఈ దశ చాలా ముఖ్యమైనది. ఈ దశలోనే మామిడి తోటల్లో ఆకుగూడు పురుగు, తేనె మంచు పురుగు వ్యాప్తించి పంటను పూర్తిగా నాశనం చేస్తుంది. రైతులు ఉద్యానవన అధికారుల సూచనలను పాటించకుండా మార్కెట్‌లో అధిక ధరలకు దొరికే నకిలీ మందులను కొనుగోలు చేసి మామిడి తోటలపై పిచికారీ చేస్తున్నారు. ఆకుగూడు పురుగు, తేనె మంచు పురుగు గమనించిన వెంటనే ఫ్రొఫెనోఫాస్ 2 మి.లీ లేదా క్లోరోపైరిపాస్ 2 మి.లీ లేదా ఇమామేక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రా, అజాడిరక్టిన్ 1500 పీపీఎం 5 మి.లీ ఒక లీటర్ నీటికి కలిపి చెట్టు అంతా తడిచేలా పిచికారీ చేసుకోవాలి.

### నీటి యాజమాన్యం

పూతకు రెండు నెలల ముందు నీరు కట్టడం ఆపి చెట్లను నీటి ఎద్దడికి గురి చేయాలి. దీనివలన చెట్లు ఒకే మారు పూతకు వస్తాయి. ముఖ్యంగా పూమొగ్గల పెరుగుదల దశలో తేలికపాటి తడి ఇచ్చినట్లు అయితే త్వరగా పిందె కడుతుంది. పిందెలు బఠాణి, నిమ్మకాయ పరిమాణంలో ఉన్నప్పుడు నీటి తడులు ఇచ్చినట్లైతే కాయ పరిమాణం బాగా పెరుగుతుంది. కాయ కోతకు 10నుంచి 15 రోజుల ముందు నీరు పెట్టడం నిలిపివేస్తే కాయ నాణ్యత పెరుగుతుంది. డ్రిప్ నీటి పారుదల పద్ధతి వలన మామిడి దిగుబడి పెరుగుతుంది.

### ఎరువుల యాజమాన్యం

మామిడి తోటల్లో ఎరువుల యాజమాన్య పద్ధతి ముఖ్యమైనది. చెట్టు వయస్సును బట్టి ఎంత మోతాదులో పశువుల ఎరువు, నత్రజని, భాస్వరం, పొటాష్ ఎలా వేసుకోవాలో రైతులు తెలుసుకొని ఉంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందవచ్చు. నత్రజనిని 50 శాతం పశువుల ఎరువు రూపంలో ఇవ్వాలి. మిగిలిన 50 శాతం రసాయన ఎరువుల రూపంలో అందించాలి. కాపునకు రాని తోటల్లో ఉద్యానవన శాఖ అధికారులు సిఫారసు చేసిన ఎరువులను 2 నుంచి 3 నెలలకు ఒక సారి వేయాలి. మామిడి కోత అయిన వెంటనే 2/3 వంతు ఎరువులను వేయాలి. మిగితా 1/3 ఎరువులను ఫిబ్రవరి 3వ వారంలో వేయాలి. తొలకరిలోనే జూన్, జూలై నెలల్లో జీలుగ, జనుము లాంటి పచ్చిరొట్ట పైర్లను మామిడి చెట్ల మధ్యలో వేసి 45-50 రోజులలో కలియదున్నాలి. మామిడి తోటల్లో సేంద్రియ ఎరువులు ఎక్కువగా వాడాలి.పశువుల ఎరువు, వర్మి కంపోస్టు ప్రతి చెట్టు పాదులో వేయాలి. పది సంవత్సరాలు పైబడిన చెట్లకు కిలో నత్రజని 2.2 కిలోల యూరియా, పొటాషియం 1.6 కిలో, ఒక కిలో భాస్వరం జూన్, జూలై నెలల్లో చెట్టు ప్రధాన కాండం నుంచి 2 మీటర్ల దూరంలో పాదులో వేయాలి.కాయలు నిమ్మకాయ పరిమాణంలో ఉన్నప్పుడు పొటాషియం నైట్రేట్ 10 గ్రాముల చొప్పున ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

### సూచనలను పాటించాలి



కొల్లాపూర్‌ప్రాంతంలో మామిడి తోటలు అధికంగా ఉన్నాయి. ఇక్కడి భూమి స్వభావం మామిడి తోటలకు అనుకూలంగా ఉంది. మామిడి రైతు లు ఉద్యాన అధికారుల సూచనల ను పాటిస్తే దిగుబడి పెరిగే అవకాశం ఉంది. రైతులు భూ యాజమన్య పద్ధతులను పాటించాలి.

– ఎం లక్ష్మణ్, జిల్లా ఉద్యానవన అధికారి

# రైతుల కష్టం.. కృష్ణార్పణం

- మక్తల్ నియోజకవర్గంలో కృష్ణ జింకల బెడద
- సాగు నీటి వనరులతో పెరిగిన సంతతి
- గుంపులు గుంపులుగా పొలాలపై దాడి
- కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న వైనం
- పంటలను కాపాడాలని రైతన్నల వేడుకోలు


మక్తల్ శివారులోని పంటపొలాల్లో తిరగాడుతున్న కృష్ణ జింకలు




మక్తల్ టౌన్, డిసెంబర్ 17 : నియోజకవర్గంలో నీటి వనరులు, సాగు విస్తీర్ణం, గణనీయంగా పెరగడంతో కృష్ణ జింకల సంతతి కూడా పెరిగింది. గతంలో నీటి వసతి లేని కారణంగా ఆముదం చిరుధాన్యాల పంటలను సాగు చేస్తున్న క్రమంలో జింకల అలజడి పెద్దగా ఉండేది కాదు. కాలక్రమేణా నియోజకవర్గంలో నీటి వసతితోపాటు హరితవనం పేరిట చిట్టడువుల విస్తీర్ణం పెరగడంతో కృష్ణ, భీమా నదీ పరివాహక ప్రాంతంలో జింకల సంతతి పెరిగింది. కృష్ణ జింకల సంఖ్య పెరగడంతోపాటు దుప్పిల సంఖ్య గణనీయంగా ఉండడం వల్ల కృష్ణ జింకల సంతానం క్రమంగా అభివృద్ధి చెందుతూ వస్తోంది. తాగడానికి నీరు విస్తారంగా పంటల సాగు, ఆహార కొరత, నీటి కొరత తీరుస్తుండడంతో ఈ ప్రాంతంలో జింకలు గుంపులు గుంపులుగా పంట పొలాలపై దాడి చేసి రైతుల కష్టాన్ని, పండిన పంటకు నష్టం చేకూరుస్తున్నాయి. మక్తల్ నియోజకవర్గం ప్రాంతంలో కృష్ణా, భీమా నదుల పరీవాహక ప్రాంతం సంగమంగా ఏర్పడ్డ చోట అడవి ఉండడంతో అక్కడి నుంచి జింకల సంతతి భారీ స్థాయిలో పెరిగి కర్ణాటక ప్రాంతం నుంచి మక్తల్ నియోజకవర్గం వైపు కృష్ణ జింకల దారి మళ్లడంతో ఈ ప్రాంతంలోని రైతులకు జింకల బెడద తప్పడం లేదని చెప్పుకోవచ్చు. కృష్ణ జింకలు 30 నుంచి 50 జింకల గుంపు కలిసి ఒక మందగా తిరుగుతుంటాయి. ప్రతి మందలో ఒక బలిష్టమైన మగజింక ఉంటుంది. మగ కృష్ణ జింక సుమారు 32 అంగుళాల పొడవు పెరుగుతుంది. దీని కొమ్ములు మూడు నుంచి నాలుగు మలుపులతో మెలికలు తిరిగి సుమారు 28 అంగుళాల పొడవు దాకా పెరుగుతాయి. మగ జింకలో శరీరపు పైభాగం నలుపు లేదా ముదురు గోదుమ రంగులో ఉండి కడుపు ఇంకా కళ్ల చుట్టూ ఉండే ప్రాంతం మాత్రం తెలుపు రంగులో ఉంటుంది. వీటికి భిన్నంగా జింకలు లేత గోధుమ రంగులో ఉంటాయి వీటికి కొమ్ములు ఉండవు. ఇవి గడ్డిని, పండ్లను తింటుంటాయి, ఎప్పుడు బయటకు వెళ్లినా ఒంటరిగా వెళ్లవు గుంపుగా బయలుదేరి పంట పొలాలపై ఒక్కసారిగా దాడి చేయడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

### కృష్ణ జింకల అలజడి

ఒకప్పుడు సాగునీరు లేక నియోజకవర్గంలోని మక్తల్, మాగనూర్, కృష్ణ, నర్వ మండలాల్లో రైతన్నలు ఆముదం పంటతోపాటు చిరుధాన్యాల పంటలను సాగు చేస్తూ జీవనం కొనసాగిస్తుండేవారు. చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, భూత్పూర్ రిజర్వాయర్లను పూర్తి చేసి భీమా నీటితో రెండు రిజర్వాయర్లను నింపడం వల్ల నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సాగునీరు పుష్కలంగా అందుతుండడంతో పంటల విస్తీర్ణం పెరిగింది. సాగునీటి వనరులు, పంటల విస్తీర్ణంతోపాటు కృష్ణ జింకలు పెరిగిపోవడంతో వాటి వల్ల రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంట పొలాలను నాశనం చేసేందుకు మిడతల దండు లాగే కృష్ణ జింకల దండు ఒక్కసారిగా వచ్చి పడుతుండడంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట విత్తినప్పటి నుంచి చేతి కొచ్చే వరకు రైతులు పొలాల వద్ద ఉండి పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నప్పుడే వీటి దాడి ఎక్కువవుతున్నదని వాపోతున్నారు. జింకల బెడదల వల్ల కంటికి కునుకు లేకుండా పోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రిజర్వ్ ఫారెస్ట్ అడవుల నుంచి కృష్ణ జింకలు ఇక్కడికి రావడంతో కృష్ణ జింకలను నియంత్రించే పనిలో ప్రభుత్వాలు సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల వీటి ఆవాసం పూర్తిస్థాయిలో పెరిగి రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. కేసీఆర్ సర్కార్ మక్తల్ నియోజకవర్గం కృష్ణ మండలం ముడుమాల్ గ్రామంలో ప్రభుత్వ సర్వే నెంబర్ 192,194 లో 74 ఎకరాల 10 గుంటల భూమిని అటవీ శాఖ అధికారులకు కేటాయించారు. ఈ భూమిలో ఫినిషింగ్ ఏర్పాటు చేసి కృష్ణ జింకాలను ఒకే సమూహంలోకి తేవాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడం వల్ల ఆ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. మక్తల్ నియోజకవర్గంలో కృష్ణ జింకల సంపతి మూడు వేల వరకు ఉంటుందని అంచనా. కొత్త ఏర్పడిన ప్రభుత్వమైనా స్పందించిన కృష్ణ జింకల నుంచి రైతులను పంటల పొలాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### పంట మొత్తం జింకల పాలే..



రాత్రింబవళ్లు ఎంతో కష్టపడి సాగు చేసిన పంట అంతా జింకల పాలవుతున్నది. వేలకు వేలు ఖర్చు పెట్టుకొని విత్తనాలు తీసుకొచ్చి పొలంలో పంట సాగు చేసుకుంటే విత్తనాలు విత్తినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు జింకల బెడద నుంచి తప్పించి పంట కోసుకొనే వరకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. అచ్చంపేట ప్రాంతం లో వేలాది సంఖ్యలో జింకల గుంపులు పొలాలపై సంచరిస్తూ పొలాల ను నాశనం చేస్తున్నాయి. జింకల బెడద నుంచి రైతులను కాపాడాల్సిన ప్రభుత్వాలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

- బాలప్ప, రైతు, అచ్చంపేట, మాగనూరు మండలం

### పంటలను కాపాడుకోలేకపోతున్నాం...



వ్యవసాయమే జీవనాధారంగా ఉండడంతో మేం పొలాల్లో సాగు చేసుకున్న పంటలను కృష్ణ జింకలు నాశనం చేస్తున్నాయి. పంట వేసిన మొదలు కోత దశకు వచ్చే వరకు కంటి రెప్పలా కాపాడుకుంటున్నా.. వేలాదిగా వచ్చే జింకల గుంపుల నుంచి మా పంటలను కాపాడుకోలేక పోతున్నాం. దీంతో సాగు కోసం తెచ్చిన అప్పులు పెరిగిపోతున్నా పంటలు మాత్రం చేతివచ్చే పరిస్థితి లేకుండా పోతున్నది. జింకల బారి నుంచి పంటలను కాపాడాలని అధికారులను కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కొత్త ప్రభుత్వమేనా రైతుల ఇబ్బందులు తీర్చుతుందని ఆశిస్తున్నాం. - శ్రీనివాస్, రైతు, కర్ని, మక్తల్ మండలం

### ప్రభుత్వానికి నివేదిక అందించాం...



మక్తల్ నియోజకవర్గంలో కృష్ణ జింక అలజడి గణనీయంగా పెరిగిన విషయం వాస్తవమే. గతంలో పంటల విస్తీర్ణం తక్కువగా ఉండడం వల్ల కృష్ణ జింకలు తక్కువగానే ఉండేవి. ప్రస్తుతం నీటి వనరులు, పంటల విస్తీర్ణం పెరగడంతో కృష్ణ జింకల సంఖ్య భారీ స్థాయిలో పెరిగింది. జింకల నుంచి రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కలెక్టర్ ద్వారా గతంలో ప్రభుత్వానికి నివేదిక అందించాం. ప్రస్తుతం ప్రభుత్వ మార్పిడి అయినందువల్ల మరోసారి నివేదిక ప్రభుత్వానికి అందించి జింకల బెడద నుంచి రైతులను రక్షించే చర్యలు చేపడతాం.

- వీణా వాణి..
అటవీశాఖ జిల్లా అధికారిణి, నారాయణపేట

### పలు దఫాలుగా అసెంబ్లీలో చర్చించాం..




నియోజకవర్గంలో కృష్ణ జింకల బెడద నుంచి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జింకలను నియోజకవర్గం నుంచి తరలించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అసెంబ్లీ సమావేశాల్లో పలు దఫాలుగా చర్చించాం. మక్తల్, మాగనూర్, కృష్ణ, నర్వ మండలంలో జింకల బెడద భారీ స్థాయిలో ఉన్నది వీటివల్ల రైతులు సాగు చేసుకున్న పంటలు జింకలు నాశనం చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రం ప్రభుత్వం నుంచి అటవీ పెంపుదల కోసం సరైన సాకారం లేక పోవడంతో వాటిని నివారించ లేక పోయాం. ప్రస్తుత ప్రభుత్వమైన జింకల బెడద నుంచి రైతుల బాధలు తీర్చేందుకు చర్యలు తీసుకోవాలి.

-చిట్టెం రామ్మోహన్‌రెడ్డి,
మాజీ ఎమ్మెల్యే మక్తల్

# బాబోయ్ దొంగలు..!

- వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న ప్రజలు
- నిద్రావస్థలో పోలీసు యంత్రాంగం
- రూ.లక్షల నగదు, బంగారంతో పరారీ
- మక్తల్‌లో అంతుచిక్కని దొంగతనాలు

మక్తల్, డిసెంబర్ 17 : చీకటి పడితే ఎవరి ఇంటికి కన్నం వేస్తారో, ఎవరి ఇంటిలో దొంగతనాలు జరుగుతాయోనని భయంతో స్థానికులు వణికి పోతున్నారు. ఓ పథకం ప్రకారం దుండగులు తాళాలు వేసిన ఇండ్లనే టార్గెట్ చేస్తూ వరుస చోరీలకు పాల్పడుతున్నారు. మక్తల్ పట్టణంలో వారం రోజుల్లో పలు కాలనీలల్లో వరుస దొంగతనాలు జరిగాయి. పది ఇండ్లల్లో గుర్తు తెలియన వ్యక్తులు దొంగతనాలకు పాల్పడినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఈనెల 11న మక్తల్ పట్టణంలో పాత సినిమా టాకీస్ ఏరియాలో సాదిక్‌పాషా ఇంట్లో సాయంత్రం 5 నుంచి 6 గంటల ప్రాంతంలో కొందరు గుర్తు తెలియని దుండగులు ముఖానికి మంకీ మాస్కులు ధరించి ఇంటి తలుపు తట్టారు. ఇంట్లో ఉన్న బాలింత తలుపు తీయడంతో దౌర్జన్యంగా ఇంట్లోకి ప్రవేశించారు. ఇంటి యజమానులు పని నిమిత్తం బయటకు వెళ్లడంతో పదిహేను రోజుల బాలింత మాత్రమే ఒంటరిగా ఇంట్లో ఉంది. నలుగురైదుగురు ముఖానికి మంకీ మాస్కులు వేసుకున్న దుండగులు పసికందును చేతిలోకి తీసుకొని ఇంట్లో ఎక్కడ డబ్బులు ఉన్నాయో చెప్పాలని, లేకపోతే నీ బిడ్డను నేలకు విసిరి వేస్తామని బెదిరించారు. దీంతో బీరువా తాళాలు తీసుకుని అందులో ఉన్న రూ.5.5 లక్షలు తీసుకొని పరారయ్యారు. ఈ ఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఇదిలాఉండగా గత నెల 28న తెల్లవారు జామున 3-4 గంటల ప్రాంతంలో మక్తల్ పట్టణంలో అయ్యప్పకాలనీలో దాసరిదొడ్డి వెంకటప్ప ఇంట్లో అద్దెకు ఉంటున్న ఒకరి ఇంటి తాళాలు పగుల గొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న 8 తులాల వెండి గ్లాసు, రూ.5 వేల నగదు దొంగిలించారు. అదేరోజు అయ్యప్పగుడి సమీపంలో తాళం వేసి ఉన్న ఒక ఇంటిని, పక్కనే షటర్ తాళాలు విరగొట్టి దోపిడీకి విఫలయత్నం చేశారు. స్టోర్ రూంలో చిన్నపిల్లల బిస్కెట్ ప్యాకెట్లు, పటాకులు సంచులు ఉండడంతో ఏమి లభించలేదు. అయితే నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు ముఖానికి మంకీ మాస్కులు వేసుకొని ఉన్నట్లు సీసీ కెమెరాలో రికార్డైంది. అక్కడి నుంచి శ్రీరామ్‌నగర్, న్యూ శబరి కాలనీలో ఒక టీచర్ ఇంట్లో బీరువా తాళాలు విరగొట్టి వస్తువులు చిందర వందర చేశారు. కృష్ణ మండలం గుడెబల్లూర్ గ్రామంలో ఈనెల 9న పట్టపగలు మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో తిరుమలగౌడ్ అనే వ్యక్తి ఇంట్లో బీరువాలో ఉంచిన ఆరు తులాల బంగారం, రూ.40 వేలు నగదు ఎత్తుకెళ్లారు. అయితే వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దుండగులు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చారు ? అనేది పోలీసులకు సైతం అంతు చిక్కడం లేదు. ఈ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులు అందరు ఒకే విధంగా ముఖానికి మంకీ మాస్కులు వేసుకొని ఉన్నారు. దాదాపు పది మంది మహిళలు, పది మంది పురుషులు గుర్తుతెలియని వ్యక్తులు మక్తల్ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. ఒక వేళ ఉపాధి కోసం వచ్చి స్థానికంగా ఇటుకల బట్టీలలో పనులు చేస్తూ రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారా? అనేది ప్రశ్నార్థంగా మారింది. కాగా పట్టణంలో రాత్రి వేళలో పోలీసులు సరైన విధంగా పెట్రోలింగ్ చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దొంగ తనాలకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు.


మక్తల్‌లో ఓ ఇంట్లో బీరువా తాళాలు తెరిచి వస్తువులను చిందర వందరగా వేసిన దృశ్యం



మక్తల్‌లో మొఖానికి మాస్కు ధరించి ఓ ఇంటి గోడ దూకి లోపలికి ప్రవేశిస్తున్న దుండగుడు

### ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన కొన్ని గంటల్లోనే చోరీ..

మక్తల్ పట్టణంలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో పలువురు బాధితులు ఈనెల 11న ఈవిషయమై స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కలిసి ఫిర్యాదు చేశారు. మరో విచిత్రం ఏమిటంటే ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన కొన్ని గంటల్లోనే పట్టణంలో పాత సినిమా టాకీస్ ఏరియాలో సాదిక్‌పాషా అనే వ్యక్తి ఇంట్లో దాదాపు రూ.5. 5 లక్షలు దోచుకొని వెళ్లడం గమనార్హం. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అవసరమైతే రాత్రి వేళలో దొంగతనాలు జరగకుండా తాను గస్తీ తిరుగుతానన్నారు. పట్టణంలో దొంగతనాలు జరగకుండా రాత్రి వేళలో పెట్రోలింగ్ చేయాలని, దొంగలను పట్టుకోవడానికి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక సీఐ, ఎస్సైలను ఆదేశించారు.

## మిడ్జిల్‌లో చోరీ

మిడ్జిల్, డిసెంబర్ 17 : మిడ్జిల్‌లోని పోలీసు స్టేషన్ సమీపంలో ఉన్న కిరాణం దుకాణంలో చోరీ చేసిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. ఎస్సై శివనాగేశ్వర్ కథనం మేరకు మండల కేంద్రంలోని పురుషోత్తం కిరాణం దుకాణంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. షాపులో రూ.20 వేల నగదు, రూ. 10వేల సిగరెట్ ప్యాకెట్లు తీసుకెళ్లినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

## నేటి నుంచి జాతీయ సదస్సు

పాలమూరు, డిసెంబర్ 17 : పాలమూరు విశ్వవిద్యాలయ పరిధిలోని కొల్లాపూర్ పీజీ సెంటర్‌లో ఈనెల 18, 19వ తేదీల్లో సోషల్ వర్క్ విభాగం వారి ఆధ్వర్యంలో విపత్తు నిర్వాహణ మానసిక చేయూత అందించడంలో 'సంఘ సేవకుని పాత్ర' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్ పోలోనియస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పీయూ ఉపకులపతి ప్రొఫెసర్ ఎల్‌బీ. లక్ష్మీకాంత్‌రాథోడ్, రిజిస్ట్రార్ గిరిజామంగతాయారు హాజరుకానున్నట్లు తెలిపారు.

## సౌత్ ఇండియా కరాటే టోర్నీలో విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్‌టౌన్, డిసెంబర్ 17 : జడ్చర్ల పట్టణంలో ఆదివారం జరిగిన సౌత్‌జోన్ కరాటే టోర్నీలో జిల్లా కేంద్రంలోని కింగ్ షోటోకాన్ విద్యార్థులు మల్లేశ్, అవేజ్, మరియాబేగం,సాబీర్‌పాషా పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాషాఖాద్రీ అభినందించారు. కార్యక్రమంలో కోచ్‌తోపాటు విద్యార్థులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.